సాక్షి కర్నూలు

సోమవారం ၊ 8 ၊ జనవరి ၊ 2024



భ్రామరీకి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తుల ను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



చౌడేశ్వరిదేవి దీక్ష విరమణ

బనగానపల్లె: నందవరం శ్రీ చౌడేశ్వరిదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారి దీక్ష విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో చండీయాగం పూర్ణాహుతితో ముగిసింది.



నేత్ర దానం

బేతంచెర్ల: బుగ్గానిపల్లె గ్రామానికి చెందిన సుబ్బారావు(80) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు కర్నూలు రెడ్ క్రాస్ ఐ బ్యాంక్‌కు దానం చేశారు.

న్యూస్‌రీల్

కేఎంసీ అలుమ్ని నూతన సంఘం ఎన్నిక



కేఎంసీ అలుమ్ని సంఘం నూతన సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సంఘం(అలుమ్ని) నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఆదివారం కళాశాలలోని నూతన క్లినికల్ లెక్చర్ గ్యాలరీలో సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షులుగా డాక్టర్ బి. కుమారస్వామిరెడ్డి, కార్యదర్శిగా డాక్టర్ జి. బాలమద్దయ్య, ట్రెజరర్‌గా డాక్టర్ ఎం. మహేశ్వరరెడ్డి ఎన్నికై బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు మెడికల్ కాలేజీలో నాలెడ్జ్ సెంటర్ స్థాపించాలని నూతన సంఘం తీర్మానించింది. ఇందుకోసం దాదాపు రూ.20కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. ఈ మొత్తాన్ని పూర్వ విద్యార్థుల నుంచి సేకరించనున్నట్లు పేర్కొంది.

మిర్చి క్వింటా రూ.21,019



రైతులు యార్డుకు తీసుకొచ్చిన మిర్చి

ఆదోనిఅర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం మిర్చి క్వింటా గరిష్ట ధర రూ.21,019గా నమోదైంది. యార్డుకు 1,354 సంచుల ఎండు మిర్చి వచ్చింది. బ్యాడిగి రకం రూ.15,810, తేజ రకం రూ.21,019, డీలక్స్ రకం రూ.11,009, తిరుమూర్తి రకం క్వింటా ధర రూ.20,100 పలికింది. ఈ టెండర్లలో 35 మంది వ్యాపారులు పాల్గొనడంతో గుంటూరు, బ్యాడిగ, రాయచూరు, బళ్లారి మార్కెట్లలో ధర తమకు ఆదోని యార్డు లభించిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

కలెక్టరేట్‌లో నేడు 'స్పందన'

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల, డివిజన్, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

ఓంకారేశ్వరుడికి వెండి కవచం విరాళం

మహానంది: బండిఆత్మకూరు మండలం ఓంకారం క్షేత్రంలో కొలువైన శ్రీ గంగా, ఉమా సమేత ఓంకార సిద్దేశ్వర స్వామికి కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వర్ రెడ్డి, తులసి రెడ్డి దంపతులు ఆదివారం వెండి కవచం విరాళంగా అందించారు. ఈ మేరకు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఆలయ ఈఓ నాగ ప్రసాద్, ప్రధా నార్చకులు సుధాకర్ శర్మ ఆధ్వర్యంలో ముందుగా శాస్త్రోక్త పూజల అనంతరం స్వామివారికి అలంకరించారు. దాతలను అభినందించి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు.



వెండి కవచం విరాళం అందిస్తున్న దాతలు

చిగురించిన అన్నదాత ఆశలు

- పూతతో కళకళలాడుతున్న మామిడితోటలు
- ఈ ఏడాది లక్ష టన్నుల దిగుబడి వచ్చే అవకాశం
- మామిడి తోటలకు క్యూ కడుతున్న వ్యాపారులు
- నాణ్యతను పెంచేందుకు ఫ్రూట్ కవర్ల వినియోగం
- చీడపీడల నివారణకు జాగ్రత్తలు తప్పనిసరి

మామిడి రైతుల ఆశలు చిగురించాయి. చెట్ల నిండా వచ్చిన పూతతో తోటలు కళకళలాడుతున్నాయి. వాతావరణం అనుకూలిస్తుండటంతో ఈ ఏడాది ముందుస్తుగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. రైతులకు నష్టం వాటిల్లకుండా కాయ నాణ్యత పెంచేందుకు అధికారులు పలు సూచనలు చేస్తున్నారు.



గూడూరులో పూతతో కళకళలాడుతున్న మామిడి

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాల్లోని అన్ని ప్రాంతాల్లో ఈ ఏడాది మామిడి ముందస్తుగా పూతకు వచ్చింది. అకాల వర్షాలు, గాలుల బెడద లేకపోవడం, ఉష్ణోగ్రతలు అనుకూలించడంతో పూత నిలబడి పిందెగా మారుతోంది. దీంతో గత మూడేళ్లుగా నష్టాలు మూటగట్టుకున్న రైతులు ఈ ఏడాది పంటపై ఆశలు పెంచుకున్నారు. కర్నూలు జిల్లాలో 6 వేలు, నంద్యాల జిల్లాలో 9 వేల ఎకరాల్లో మామిడి తోటలు అభివృద్ధి చెందాయి. కరోనా కారణంగా 2021, 20022లో మామిడికి సరైన మార్కెటింగ్ లేక రైతులు నష్టపోయారు. 2023లో వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా పూత రాలిపోయి రైతులను నిరాశకు గురి చేసింది. ఈ సారి తోటల్లో పూత సమృద్ధిగా రావడంతో పంట పండినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

లక్ష టన్నుల దిగుబడి వచ్చే అవకాశం

పూత, పిందె నిలబడితే ఎకరాకు 6 నుంచి 8 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఈ లెక్కన 15వేల ఎకరాల నుంచి లక్ష టన్నుల వరకు దిగుబడి రానుంది. తోటల్లో ఎక్కువగా బేనిషాన్(బంగినపల్లి) రకానివి ఉన్నాయి. తోతపురి, మల్లిక, అమృతాలు, కేసరి, రసాలు తదితర రకాల మామిడి సైతం జిల్లాలో సాగవుతోంది. గతంలో ఎప్పుడూ లేని విధంగా పూత రావడంతో మామిడితోటల కొనుగోలుకు వ్యాపారులు పోటీపడుతున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా వస్తున్నట్లు తెలుస్తోంది.

మంచి ధర కోసం..

ముందస్తుగా పూత వచ్చి తోటల్లో పిందెలు కూడ ఏర్పడ్డాయి. గత ఏడాది బేనీసా రకం మామిడి టన్ను ధర రూ.1.10 లక్షలు పలికింది. ఫ్రూట్ కవర్లు వినియోగించి నాణ్యతను పెంచుకుంటే ఈ సారి కూడా మంచి ధర పొందే అవకాశం ఉంది. నాణ్యత ఉంటే విదేశాలకు ఎగుమతి చేయవచ్చు. ఫ్రూట్ కవర్ల వినియోగంపై ఉద్యానశాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కాయ నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు వీటిని వినియోగించాలని సూచిస్తున్నారు. వీటినినామమాత్రపు ధరకే రైతు

తెల్లపూత దశలో పిచికారీ వద్దు



మామిడిలో జాగ్రత్తలు తీసుకోవడం వల్ల పూత, మొగ్గ నిలబడటంతో పాటు పలు సమస్యలను నివారించుకోవచ్చు. మామిడిలో పూమొగ్గలు వచ్చినా, రాకపోయినా ఈ సమయంలో 13-0-45 10 గ్రాములు, సల్ఫర్ 3 గ్రాములు, మోనోక్రోటోపాస్ 1.6 మి.మీ లీటరు నీటికి పిచికారీ చేయాల్సిన అవసరం ఉంది. మొగ్గదశలో సాఫ్ 1.5 గ్రాములు, క్లోరోపైరిపాస్ 2 మి.మీ., నువాన్ 1 మి.మీ., బోరాన్ 1 గ్రాము ప్రకారం లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొగ్గదశ నుంచి పచ్చి పూత దశకు వచ్చినప్పుడు కాన్ఫిడార్ 0.5 మి.మీ., హెక్సాకొనజోల్ 2 మి.మీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. తెల్లపూత దశలో ఎటువంటి పిచికారీ చేయరాదు. ఈ దశలో పరపరాగ సంపర్కం జరుగుతుంది. ఈ సమయంలో పిచికారీ చేస్తే తేనెటీగలు మరణించే ప్రమాదం ఉంది. నల్లపూత సమయంలో 1 గ్రాము అసిఫేట్, రోకో 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవడం మంచిది.



మామిడి రైతులకు సూచనలు ఇస్తున్న ఉద్యాన అధికారులు

పూత ఆశాజనకంగా వచ్చింది



మాకు 3.50 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఎక్కువగా బంగినపల్లి చెట్లు ఉన్నాయి. నాలుగైదు ఏళ్లతో పోలిస్తే ఈ సారి పూత ఆశాజనకంగా వచ్చింది. పూత బాగా నిలబడితే ఎకరాకు 8 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. నాణ్యతను పెంచుకోవడానికి ఉద్యాన శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తున్నాం. పండు ఈగ, తేనెమంచు, బూడిద తెగులు నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– చంద్రశేఖర్, రామళ్లకోట, వెల్దుర్తి మండలం

జాగ్రత్తలు తీసుకోవాలి



నాలుగేళ్లతో పోలిస్తే ఈ సారి మామిడి సంతృప్తికరంగా ఉంది. అయితే రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పండు ఈగ బెడద నుంచి కాయలను కాపాడుకోవాలి. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ.. రైతులకు సలహాలు, సూచనలు ఇస్తున్నాం. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో వర్షాధారం కింద సాగు చేసిన పంటలు నిరాశకు గురి చేశాయి. రైతులు మామిడిపైనే ఆశలు పెట్టుకున్నారు.

-పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి, కర్నూలు

11న 'జగనన్న తోడు' విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): జగనన్న తోడు పథకం కింద చిరు, వీధి వ్యాపారులు తీసుకున్న రుణాలకు వడ్డీ రీయింబర్స్‌మెంట్‌ను ఈ నెల 11న ప్రభుత్వం విడుదల చేయనుంది. ఈ పథకం కింద గ్రామీణ ప్రాంతాల్లో డీఆర్‌డీఏ–వైకేపీ, పట్టణ ప్రాంతాల్లో మెప్మా అధికారులు, సిబ్బంది చిరు వ్యాపారులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయిస్తున్నారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో వడ్డీతో సహా చెల్లించిన వారికి ప్రభుత్వం వడ్డీ రీయింబర్స్‌మెంట్ చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 11న తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా బటన్ నొక్కి చిరువ్యాపారుల బ్యాంకు ఖాతాలకు వడ్డీ విడుదల చేస్తారని డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ సలీమ్‌బాషా తెలిపారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను దర్శనార్థం వచ్చిన భక్తులతో పురవీధులు, ఆలయ క్యూలైన్లు కిటకిటలాడాయి. పాతాళగంగలో పుణ్యస్నానాలనంతరం భక్తులు ఉచిత, ప్రత్యేక దర్శన క్యూలకు చేరుకోవడంతో అన్ని క్యూ కంపార్ట్‌మెంట్లు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. స్వామి,అమ్మవార్ల దర్శన అనంతరం క్షేత్ర పరిధిలోని సందర్శనీయ స్థలాలను దర్శించుకున్నారు.



భక్తులతో నిండిన క్యూలు



నాడు: ఆస్పరి మండల పరిషత్ కార్యాలయం వద్ద పింఛన్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

నాడు ఏడీ'పింఛన్'... నేడు మురి 'పింఛన్'

టీడీపీ హయాంలో ప్రతి నెలా పింఛన్ తీసుకునేందుకు వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు మండల పరిషత్, పంచాయతీ కార్యాలయాల చుట్టూ తిరగలేక ఇబ్బందులు పడేవారు. విగిసిపోయిన ధర్నాలు కూడా నిర్వహించేవారు. అయినా సకాలంలో పింఛన్ డబ్బు చేతికందేది కాదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీనే ఇంటి వద్దకే వచ్చి పింఛన్ డబ్బు అందిస్తున్నారు. ప్రస్తుతం రూ.3వేల పింఛన్ ఇస్తుండటంతో అవ్వాతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – ఆస్పరి



నేడు: ఆస్పరిలో ఇంటికి వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి. చిత్రంలో మేయర్ రామయ్య, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, సుధాకర్ తదితరులు

కర్నూలు (టౌన్): విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఈనెల 19న నిర్వహించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మద్దయ్య, పార్టీ నగర అధ్యక్షులు సిట్రా సత్యనారయణమ్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరి సుభాష్ చంద్ర బోసుతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రూ.400 కోట్లు వెచ్చించి 19 ఎకరాల్లో రాజ్యాంగ నిర్మాత విగ్రహాన్ని ఏర్పాటు చేసిందన్నారు. మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు తూచ తప్పకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతోందన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షులు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలను ఓటు బ్యాంకుగానే చూశారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మాత్రమే గుర్తింపు లేని కులాలకు సైతం అగ్ర స్థానం కల్పించారన్నారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా రూ.2.50 లక్షల కోట్లు ఎస్సీ, ఎస్టీ బీసీ, మైనార్టీ వర్గాలకు అందించారని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు చెందిన 17 మందిని మంత్రులు చేశారని గుర్తు చేశారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకొని చంద్రబాబు లేనిపోని దుష్ప్రచారాలు చేయడం దిగజారుడుతనం కాదా అని ప్రశ్నించారు.

కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గాలకు ముఖ్యమంత్రి చేస్తున్న మేలును గ్రామగ్రామానా ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి సచివాలయంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించాలని పిలుపు నిచ్చారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థపై చంద్రబాబు విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. 14 సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు పేదలకు చేసిన మంచి ఏదైనా ఉందా అని ప్రశ్నించారు.

కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమం సజావుగా సాగుతోందన్నారు. నాలుగున్నర సంవత్సరాలుగా లంచాలు లేకుండా ప్రజలకు పథకాలు అందుతున్నాయన్నారు. ఈ నెల 19న నిర్వహించే అంబేడ్కర్ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం చరిత్రలో నిలిచిపోతుందన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరి సుభాష్ చంద్రబోస్, నగర పార్టీ అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ మద్దయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్ రెడ్డి అందరికీ మేలు చేస్తున్న, ఆయన నాయకత్వాన్ని బలపరచాలన్నారు. పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, నంద్యాల, కర్నూలు జిల్లాల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వంగాల భరత్‌కుమార్ రెడ్డి, బెల్లం మహేశ్వర రెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాస రెడ్డి, సత్యం యాదవ్, జిల్లా కార్యదర్శి కల్లు పోతుల సురేష్, దాసరి నరేష్‌కుమార్, నగరూరు పాండు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నీరు పారేలా.. పంట పండేలా!

- గోతుల దొడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం
- రూ.21.25 కోట్లు ఖర్చు చేస్తున్న ప్రభుత్వం
- 80 శాతం పనులు పూర్తి
- ఆయకట్టుగా మారనున్న 2,010 ఎకరాలు



చురుగ్గా సాగుతున్న పైపులైన్ నిర్మాణ పనులు

ఇది కదా అభివృద్ధి

మంత్రాలయం: బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నడుం బిగించింది. తుంగభద్ర నది నుంచి నీటిని తోడి రైతన్నల కలలను సాకారం చేసేందుకు శ్రీకారం చుట్టింది. మంత్రాలయంలో నియోజకవర్గంలో మెట్ట రైతులను ఆదుకునేందుకు ఏకంగా 6 ఎత్తిపోతల పథకాలను మంజూరు చేసింది. ఇందుకు రూ. 74.14 కోట్ల నిధులు ఖర్చు చేస్తోంది. ఈ నిధులతో ఖగ్గల్, 52–బసాపురం, ఐరన్‌గల్, కందకూరు, గోతులదొడ్డి, కోసిగి ఎత్తిపోతల పథకాల నిర్మిస్తున్నారు. కౌతాళం మండలం గోతులదొడ్డి ఎత్తిపోతల పథకాన్ని నిర్మాణం చేపట్టారు. రూ.21.25 కోట్లతో ఎత్తిపోతల పనులు చురుగ్గా సాగుతున్నాయి.

80 శాతం పనులు పూర్తి

గోతులదొడ్డి ఎత్తిపోతల పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. 5 కి.మీ. మేర పైపులైన్ పనులు చేశారు. త్వరలోనే పంపుహౌస్ పనులు చేపట్టనున్నారు. గోతులదొడ్డి పొలిమేర పొలాల్లోని తుంగభద్ర దిగువ కాలువలకు పైపులైన్‌ను అనుసంధానం చేయనున్నారు. నాణ్యతతో రాజీలేకుండా ప్రమాణాల ప్రకారం పనులు చేస్తున్నారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎత్తిపోతల నిర్మాణాల పనులు శరవేగంగా జరిపిస్తున్నారు.

రైతుల మోముల్లో ఆనందం

తుంగభద్ర దిగువ కాలువ పరిధిలో శివారు భూములు కావడంతో గోతులదొడ్డి, హాల్వి పంట పొలాలకు సాగునీరందడం లేదు. ఎన్నో ఏళ్లుగా పొలాలు వర్షాధారంగా మారాయి. రైతుల కష్టాన్ని గుర్తించిన ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ పొలాలకు పూర్వవైభవం రానుందని ఆనంద పడుతున్నారు. పథకం పరిధిలో 2,010 ఎకరాల మెట్ట భూములు ఆయకట్టుగా మారనుండటంతో రైతులు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సంతోషంగా ఉంది



ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టడం ఎంతో సంతోషంగా ఉంది. పథకం పరిధిలో మాకు మూడు ఎకరాల భూమి ఉంది. ఏళ్లుగా వానలొస్తేనే పంటలు చేతికొస్తున్నాయి. ఈ పథకం పూర్తయితే మా పొలాలన్నీ ఆయకట్టుగా మారనున్నాయి. సాగునీరు వస్తే మా కష్టాలు దాదాపుగా గట్టెక్కుతాయి. – రంగస్వామి, రైతు

ఎంతో మేలు



మా గ్రామస్తులకు ఈ పథకం నిర్మాణంతో ఎంతో మేలు జరుగుతోంది. గత ప్రభుత్వాలు ఏవీ మా కష్టాలు పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చీరాగానే ఎత్తిపోతల పథకం మంజూరు చేసింది. మాలాంటి కరువు రైతులకు అండగా నిలవడం నిజంగా సంతోషం. పథకం పరిధిలో మాకు 9 ఎకరాల భూమి ఉంది. ఇది ఆయకట్టుగా మారనుంది. – మహేంద్రగౌడ్, రైతు

న్యూఢిల్లీకి పీఏసీఎస్‌ల ప్రతినిధులు

కర్నూలు(అగ్రికల్చర్): న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కేంద్ర హోం, సహకార మంత్రిత్వ శాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నిర్వహించే సదస్సులో పాల్గొనేందుకు జిల్లా నుంచి వివిధ పీఏసీఎస్‌ల ప్రతినిధులు తరలివెళ్లారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో పెద్దకడుబూరు, పెద్దహరివాణం, మద్దికెర, మధిర, సీ.బెళగల్, ఓర్వకల్లు, హొళగుంద, కౌతాళం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల చైర్మన్‌లు, సీఈవోలు 20 మంది ఉన్నారు. సహకార వ్యవస్థ ద్వారా జనరిక్ మందులను కేంద్ర ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకెళ్తోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా సహకరిస్తోంది. 'పీఏసీఎస్ యాజ్ జనౌషధి కేంద్రాలు' అనే అంశంపై నిర్వహించే కార్యక్రమంలో హోమ్‌మంత్రి అమిత్‌షా పీఏసీఎస్‌ల ప్రతినిధులతో ముఖాముఖి కానున్నారు. జనరిక్ మందుల విశిష్టత, వీటికి ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం, జనరిక్ మందుల వినియోగంతో ప్రజలకు కలిగే ప్రయోజనం.. తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు.



'సాక్షి' స్పెల్‌బీకి విశేష స్పందన

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఆదివారం కర్నూలులో నిర్వహించిన రీజినల్ స్థాయి స్పెల్‌బీ సెమీఫైనల్ పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీల్లో అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి నాలుగు క్యాటగిరీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

- వివరాలు 8లో▸

క్లుప్తంగా

బీసీ హాస్టళ్లలో ముందస్తు ‘సంక్రాంతి’ సంబరాలు



వెల్దుర్తి బాలికల వసతి గృహంలో సంక్రాంతి ముగ్గులు వేసిన విద్యార్థినులు

కర్నూలు(అర్బన్): జిల్లాలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాల్లో ‘ క్రాంతి – సంక్రాంతి ’ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ నెల 9వ తేదీ నుంచి ప్రభుత్వ పాఠశాలలకు సంక్రాంతి సెలవుల నేపథ్యంలో ముందస్తు సంక్రాంతి వేడకలు, మేగా క్లీనింగ్ మేళాను నిర్వహించినట్లు జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ చెప్పారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం నుంచి హాస్టళ్లలోని విద్యార్థులు సంక్రాంతి సెలవులకు తమ సొంత ఊళ్లకు వెళ్తున్న దృష్ట్యా అన్ని వసతి గృహాల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు చెప్పారు.

యువకుడి ప్రాణం తీసిన విద్యుదాఘాతం



కటిక షఫీ(ఫైల్)

నందవరం: మండల పరిధిలోని కొత్తకై రవాడి గ్రామానికి చెందిన కటిక షఫీ(24) విద్యుత్ ఘాతంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపిన వివరాలు ఇవి.. గ్రామంలో ఆదివారం ఉదయం కుళాయికి నీరు రావడంతో ఇంటిలోనికి పంపు చేయాలని విద్యుత్ మోటార్‌ను షఫీ ఆన్ చేశాడు. మోటార్‌కు పైపు తగిలించబోయి విద్యుత్ ఘాతానికి గురై స్పృహ కోల్పోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆటోలో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. షఫీకి భార్య గౌసియా(6 నెలల గర్భిణి), ఏడాదిన్నర కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి షేక్షావలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

డాక్టర్ మధుసూదనరావుకు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న డాక్టర్ మధుసూదనరావు

నంద్యాల టౌన్: నంద్యాలకు చెందిన ఈఎన్‌టీ వైద్యులు మధుసూదన్ రావుకు జాతీయ ఈఎన్‌టీ వైద్యుల సంఘం సభ్యులు జాతీయస్థాయి లైఫ్ టైం అచీవ్ మెంట్ పురస్కారాన్ని అందించారు. బెంగుళూరులో గత నాలుగు రోజులుగా జరుగుతున్న 75వ జాతీయ చెవి, ముక్కు, గొంతు వైద్యుల సదస్సులో ఆయనకు బంగారు పతకం, ప్రశంసా పత్రం ప్రదానం చేసినట్లు రాష్ట్ర ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుల ఫోరం చైర్మన్ డాక్టర్ రవికృష్ణ తెలిపారు. వైద్య రంగంలో ఆయన చేసిన సేవలు గుర్తించిన జాతీయ ఈఎన్‌టీ వైద్యుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ శంకర్ మెడికేరి, కార్యదర్శి డాక్టర్ కౌశల్ షేఠ్ ఆయనకు ఈ పురస్కారం అందించారన్నారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు ఆయనకు అభినందనలు తెలిపారు.

‘సాక్షి’ స్పెల్‌బీకి విశేష స్పందన

- సెమీఫైనల్ పోటీలకు హాజరైన కర్నూలు, అనంతపురం జిల్లాల విద్యార్థులు
- ఆంగ్ల పరిజ్ఞానం పెంపునకు స్పెల్‌బీ ఎంతో ప్రయోజనం
- కొత్త పదాలు, పదాల ఉచ్ఛారణ తెలుసుకునేందుకు అవకాశం
- సాక్షి మీడియా గ్రూప్‌కు కృతజ్ఞతలు తెలిపిన విద్యార్థులు





కర్నూలులో ఆదివారం రీజినల్ స్థాయిలో నిర్వహించిన సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులకు ఆంగ్ల పదాలపై అవగాహన కల్పిస్తున్న యాంకర్

SAKSHI
SAKSHI DIGITAL MEDIA GROUP

SAKSHI SPELL Bee 2023-24

కర్నూలు సిటీ: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు ఆంగ్ల పరిజ్ఞానం తప్పనిసరి. మంచి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే ప్రపంచ భాషగా గుర్తింపు పొందిన ఇంగ్లిష్‌లో నైపుణ్యం సాధించాలి. ఇందు కోసం విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త పదాలు తెలుసుకోవాలి. భాషా నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇందుకు స్పెల్‌బీ వంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఇవి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్నారు. అయితే తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థుల కోసం ఇలాంటి కార్యక్రమాన్ని సాక్షి మీడియా గ్రూప్ గత కొన్నేళ్లుగా నిర్వహిస్తోంది. ఆదివారం కర్నూలులోని రవీంద్ర స్కూల్‌లో రీజినల్ స్థాయి స్పెల్‌బీ సెమీఫైనల్ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజెంటింగ్ స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాపి, అసోసియేట్ స్పాన్సర్‌గా ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరించాయి. పోటీలకు విశేష స్పందన లభించింది. అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి నాలుగు క్యాటగిరీలకు చెందిన 58 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కొత్త పదాలు పరిచయం కావడంతోపాటు, వాటి ఉచ్ఛారణ గురించి తెలుసుకున్నామని చెప్పారు. ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంచేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతోందని తల్లిదండ్రులు తెలిపారు.

కొత్త పదాలు తెలుసుకోవచ్చు



స్పెల్‌బీ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి కార్యక్రమంతో ఆంగ్ల భాషపై పట్టు పెంచుకునేందుకు అవకాశం ఉంటుంది. అక్షర దోషాలు సరి చేసుకునేందుకు మంచి అవకాశం. కొత్త పదాలను, వాటి అర్థాల గురించి తెలుసుకోవచ్చు.

– మౌనిషా, 7వ తరగతి, రిడ్జ్ స్కూల్

నైపుణ్యాలను పెంచుకోవచ్చు



స్పెల్‌బీ పోటీల్లో మొదటి సారి పాల్గొన్నా. ఇంగ్లిషు భాష నైపుణ్యాలను పెంచుకునేందుకు ఇది మంచి అవకాశం. కొత్త పదాలకు అర్థాలు తెలుసుకోవచ్చు. ఆంగ్లంపై పట్టు ఉంటేనే నేటి పోటీ ప్రపంచంలో రాణించగలుగుతాం.

– కౌశిక్, 6వ తరగతి, లిటిల్ ప్లానెట్ స్కూల్, ఎమ్మిగనూరు

చాలా సంతోషంగా ఉంది



స్పెల్‌బీ పోటీల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఉచ్ఛారణ దోషాలను సరి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. రెగ్యులర్‌గా వాడుకలో ఉండే పదాలతో పాటు కొత్త పదాలను తెలుసుకొని వాటి అర్థాలను తెలుసుకోవచ్చు.

– వేదా సంహిత, 7వ తరగతి, రిడ్జ్ స్కూల్

స్పెల్‌బీ అంటే ఇష్టం



స్పెల్‌బీ అంటే నాకు చాలా ఇష్టం. ఇంగ్లిషు పదాల ఉచ్ఛారణ తెలుస్తుంది. ఈ అవకాశం వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. ఇంగ్లిషు గురించి తెలుసుకునేందుకు మంచి అవకాశం. ఇకపై రెగ్యులర్‌గా పోటీల్లో పాల్గొంటా.

– హేమనందన్ నాయక్, 3వ తరగతి, రిడ్జ్ స్కూల్, కర్నూలు

విజేత కావాలన్నదే లక్ష్యం



స్పెల్‌బీలో పోటీల్లో పాల్గొంటే ఇంగ్లిషు నాలెడ్జ్ పెరుగుతుంది. కొత్త పదాల గురించి, వాటి అర్థాలు, ఉచ్ఛారణ గురించి తెలుసుకోవచ్చు. వాక్యాలలో పదాల క్రమబద్ధత తెలుస్తుంది. స్పెల్‌బీ పోటీల్లో ఎప్పటికైనా విజేతగా నిలివాలని లక్ష్యంగా పాల్గొంటున్నా.

– కె.రుత్విక్ రెడ్డి, ఏడీపై, కర్నూలు

తప్పులు సరిదిద్దుకోవచ్చు



స్పెల్‌బీలో పాల్గొని ఇంగ్లిషు భాషలో నైపుణ్యం పెంచుకోవచ్చు. కొత్త పదాలు, వాటి అర్థాలు, తెలుసుకోవచ్చు. అదే విధంగా ఇంగ్లిషులో తప్పులను సరిదిద్దుకోవచ్చు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వినియోగించే పదాలపై కూడా అవగాహన వస్తుంది.

– జైత్రి, 8వ తరగతి, రవీంద్ర విద్యానికేతన్, కర్నూలు

సచివాలయాల్లో జన్ భాగీదారి

- ఈ నెల 11వ తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు

కర్నూలు(అర్బన్): విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఈ నెల 19న 125 అడుగుల ఎత్తయిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభోత్సవం చేస్తున్న సందర్భంగా జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కర్నూలు డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 11వ తేదీ వరకు ఆయా సచివాలయాల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, అడ్మిన్ సెక్రటరీ ఆధ్వర్యంలో ‘ జన్ భాగీదారి ’ కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. అంబేద్కర్ ఫొటో (16/20 ఇంచెస్ సైజ్) చేయించి, దానికి స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, ప్రజలు, సిబ్బంది పూలమాలలు వేసి నివాళి అర్పించాలన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో ఆయన పాత్ర గురించి వివరించాలన్నారు. కార్యక్రమ నిర్వహణకు 4/6 సైజ్‌లో బ్యానర్ చేయించాలని, కార్యక్రమానికి హాజరైన వారి చేత ఈ బ్యానర్‌పై పర్మనెంట్ ఇంక్ మార్కర్ పెన్‌తో సంతకాలు చేయించాలన్నారు. ఈ బ్యానర్ సాఫ్ట్ కాపీని ఇప్పటికే అన్ని సచివాలయాలకు గూగుల్ డ్రైవ్ ద్వారా పంపించామని, దాన్ని ప్రింట్ తీయించి సంతకాలు చేయించాలన్నారు. సంతకాలు చేసిన బ్యానర్‌ను గ్రామ/ వార్డు సచివాలయ లాగిన్‌లో డిజిటల్ అసిస్టెంట్, ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీ లింక్ ద్వారా అప్‌లోడ్ చేయాలన్నారు. అనంతరం ర్యాలీని నిర్వహించాలని, అలాగే ఆయా సచివాలయాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహించి అన్ని ఫోటోలను అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రతి సచివాలయం నుంచి 10 మంది ప్రజలను 19న విజయవాడలో జరిగే అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమానికి వచ్చే వారి పేర్లను ఆయా సచివాలయాలకు ఇచ్చిన లింక్‌లో రిజిష్టర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమాలను సచివాలయాల ఉద్యోగులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.

కురువలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

కర్నూలు(అర్బన్): జిల్లాలో ఐదు లక్షలకు పైగా జనాభా ఉన్న కురువలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కురువ సంఘాల జేఏసీ నేతలు ప్రకటించారు. ఆదివారం స్థానిక సంతోష్‌నగర్‌లోని ఫాంహౌస్‌లో కురువ, మదాసి, మదారి కురువ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వివిధ కురువ సంఘాల నాయకులు డా.లక్ష్మీప్రసాద్, పంచలింగాల నాగరాజు, మాన్వి దేవేంద్రప్ప, జయరామ్, మోహన్‌ప్రసాద్‌తో పాటు జిల్లాలోని 14 సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సమావేశంలో అన్ని సంఘాలు కలిసి జేఏసీగా ఏర్పాటు కావాలనే అభిప్రాయం మేరకు ఓటింగ్ జరిపారు. జేఏసీ కన్వీనర్‌గా రాయలసీమ కురువ రవికుమార్, కో కన్వీనర్లుగా తవుడు శ్రీనివాసులు, శ్రీనివాసరావు, కురువ బలరాం, కురువ మహేంద్ర, సీజీ శివయ్య, సుంకన్న, శివలింగం, తిరుమలేష్, బసవరాజు, బత్తిన కిరణ్‌కుమార్, జోషి, నాగేష్, పురుషోత్తంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు అన్ని రాజకీయ పార్టీలు కురువలకు రాజకీయ అవకాశాలు కల్పించకపోగా, కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాయన్నారు. రానున్న ఎన్నికల్లో తమకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగస్వామి, భరత్, మల్లప్ప, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి



టీడీపీ నాయకులకు కండువా కప్పి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

నందికొట్కూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపిస్తాయని శాప్ చైర్మన్, రాష్ట్ర యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి అన్నారు. పట్టణంలోని హాజీనగర్‌కు చెందిన 70 మంది టీడీపీ కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, లద్దా ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని మార్కెట్ యార్డు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీకి చెందిన సయ్యద్ చాంద్‌పాషా, సయ్యద్ రుస్తుం అలీ, సయ్యద్ కాజిమ్ బాషా, అబ్దుల్లా బిన్, సిద్దు, అబ్దుల్ హఫీజ్, హైదర్, ఓవైసీ, షేక్ రియాజ్, సలాం, హుమయున్, గౌస్, అక్బర్ వలి, సాగర్, మన్సూర్‌లకు సిద్ధార్థరెడ్డి, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సిద్ధార్థరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించడం జరిగిందని చెప్పారు. సీఎం వైఎస్ జగనన్న చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం నెరవేర్చారన్నారు. చంద్రబాబు 600 హామీలిచ్చి ఒక్క హామీని కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని స్పష్టం చేశారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను తలుపు తట్టి ప్రభుత్వం ప్రజలకు అందిస్తుందని చెప్పారు. జన్మభూమి కమిటీల ద్వారా తెలుగు తమ్ముళ్లకే పథకాలు ఇచ్చేవారని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవడానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు మన్సూర్, నాయకులు విజ్జి, అబుబక్కర్, శ్రీకాంత్, సమివుల్లా, జావీద్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

కర్నూలు సిటీ: సిల్వర్‌జూబ్లీ కాలేజీ సమావేశ మందిరంలో ఆదివారం జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు సుధీర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సంబరాల్లో ముఖ్య అతిథులుగా ప్రభుత్వ బీఈడీ కాలేజీ ప్రిన్సిపల్ ఆదినారాయణ రెడ్డి, ప్రముఖ అష్టావధాని రచయిత బి.హర్ష హాజరయ్యారు. సైన్సును నేటి తరాలకు చెందిన బాల బాలికలే ప్రచారం చేయాలన్నారు. ఆలోచన అనే ఒక విత్తనంలో జ్ఞానం అనే మహా వృక్షం దాగి ఉందన్నారు. ప్రతి పనిలోను సైన్సు ఇమిడి ఉండాలని, ప్రతి అంశాన్ని ప్రశ్నించాలన్నారు. జన విజ్ఞాన వేదిక కార్యదర్శి ఖాజా హుస్సేన్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయి చెకుముకి సంబరాలకు 42 స్కూళ్లు ఎంపిక అయ్యాయని, 21 స్కూళ్ల బృందాలు ఇందులో పాల్గొన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, విజయ్‌కుమార్, రమాదేవి పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

- బావిలో పడి తండ్రి మృతి
- కుమారుడిని రక్షించిన గ్రామస్తులు



వడ్డె వెంకట రాముడు ఫైల్



ప్రాణం బలిగొన్న బావి

గోనెగండ్ల: ఒంటిడుదిన్నె గ్రామంలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వడ్డె వెంకటరాముడు (40) అలియాస్ గణపతికి భార్య పద్మావతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. గ్రామంలోని దర్గా సమీపంలో పాడుబడిన బావిలో చేపలు పట్టేందుకు ఆదివారం ఉదయం వెంకటరాముడు, కుమారులిద్దరూ కలిసి వెళ్లారు. చేపల కోసం బావిలో గాలం వేశారు. కొద్ది సేపటికీ వెంకటరాముడుకి ఫిట్స్ రావడంతో స్పృహకోల్పోయి బావిలో పడి మునిగిపోయాడు. గమనించిన చిన్న కుమారుడు ఉరుకుంద తండ్రిని కాపాడేందుకు బావిలో దూకి అతను కూడా నీటిలో మునిగిపోయాడు. పెద్దకుమారుడు సురేంద్ర కేకలు వేయడంతో గ్రామస్తులు వచ్చి ఉరుకుందును బయటకు తీశారు. వెంకటరాముడు మాత్రం నీటిలోనే మునిగిపోయాడు. ఎంత ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. బావి లోతుగా ఉండడం అందులోను పూడిక చేరి ఉండటం కారణంగా మృతదేహాన్ని తీయడం ఇబ్బందిగా మరింది. దీంతో గ్రామస్తులు గోనెగండ్ల పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందజేశారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని నీటిని మోటర్లతో బయటకు తోడి వెంకటరాముడు మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు విచారణ చేసి కేసు నమోదు చేసుకున్నారు. చేపలు పట్టేందుకు వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వెంకటరాముడిది నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఈ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. అలాగే గ్రామంలో పాడుపడ్డ బావిలో మరోసారి ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు గాను బావిని పూడ్చివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెండేకల్లు ఆర్ఎస్‌లో ఏడాదిలోపు రెండు హత్యలు

- సైకో పనేనంటూ గ్రామస్తుల భయాందోళన



పెండేకల్లు రైల్వే జంక్షన్

తుగ్గలి: ఏడాదిలోపు రెండు హత్యలు.. అందులో ఒకరు గుర్తు తెలియని వ్యక్తి కాగా, మరొకరు మానసిక స్థితి సరిగా లేని వ్యక్తి. ఒకే తరహాలో, ఒకే ప్రాంతంలో జరిగిన ఈ హత్యలు గ్రామస్తుల్లో భయాందోళనలు రేకెత్తిస్తున్నాయి. తుగ్గలి మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే స్టేషన్ 20 ఏళ్ల క్రితం జంక్షన్‌గా మారింది. స్టేషన్ ఏర్పడినప్పటి నుంచి ఇక్కడ చుట్టుపక్కల గ్రామాలతో పాటు, వివిధ ప్రాంతాలకు చెందిన వారు వలస వచ్చి స్థిరపడిపోవడంతో గ్రామంగా తయారైంది. జంక్షన్‌గా మారిన తర్వాత రైళ్ల రద్దీ పెరిగింది. వ్యాపారాలు వృద్ధి చెందడంతో పాటు, ఇక్కడ భూముల ధరలకు రెక్క లొచ్చాయి. ఈ స్టేషన్ నుంచి నిత్యం వందలాది మంది వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఎవరెవరో కొత్త వారు వచ్చిపోతుంటారు. పాత స్టేషన్ పరిసరాలు రాత్రి అయితే చీకటిమయంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి నేపథ్యంలో గతేడాది మార్చి 14న రాత్రి స్టేషన్ పరిసర ప్రాంతంలో దాదాపు 50 ఏళ్లకు పైబడిన గుర్తు తెలియని వ్యక్తి తలపై బండరాయితో మోది హత్య చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ముమ్మర విచారణ చేసినా హతుడి ఆచూకీ దొరకలేదు. గుర్తు తెలియని వ్యక్తి హత్య జరగడంతో అప్పుడు ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. అయితే ఈనెల 6వతేదీ రాత్రి పెండేకల్లు రైల్వే స్టేషన్‌కే చెందిన పూజారి రాము అలియాస్ భీమన్న(57)ను అదే తరహాలో హత్యకు గురయ్యారు. గతంలో గుర్తు తెలియని వ్యక్తి హత్య చేసిన మాదిరిగానే ఇప్పుడు రామును కూడా తలపై బండరాయితో మోది హత్య చేయడంతో గ్రామం ఉలిక్కిపడింది. రెండు హత్యలు ఒకే రీతిలో జరగడంతో ఎవరైనా సైకో ఈ హత్యలు చేస్తున్నారా అని గ్రామస్తులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. హతులిద్దరూ ఎవరికీ హాని చేయకున్నా వీరిని ఎందుకు చంపారోనని గ్రామంలో చర్చనీయాంశమైంది. హత్య జరిగిన సమయాల్లో అదే సమయంలో వెళుతున్న రైళ్లలో హంతకులు ఏమైనా వెళుతున్నారా అనే అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. హత్యకు గురైన రాము ఎమ్మెల్సీ పోతుల సునీతకు సోదరుడు కావడం, అందులోనూ ఏడాదిలోనే ఒకే తరహాలో రెండు హత్యలు జరగడంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. హత్యలపై అన్ని కోణాల్లో ముమ్మర దర్యాప్తు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ తనిఖీలు, సీసీ ఫుటేజ్‌ల పరిశీలనతో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ ప్రాంతానికి కొత్తవారు ఎవరైనా వస్తున్నారా, అనుమానితులు ఎవరెవరు వచ్చి రైలెక్కి పోతున్నారనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని చాలా కాలం నుంచి గ్రామస్తులు కోరుతున్నారు. అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని చెబుతున్నారు.

హత్య కేసు నమోదు

మండల పరిధిలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో జరిగిన రాము హత్య ఘటనకు సంబంధించి హత్యకేసు నమోదు చేసినట్లు తుగ్గలి ఎస్‌ఐ మల్లికార్జున ఆదివారం తెలిపారు. మృతుడి సోదరుడు పూజారి లెనిబాబు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ చెప్పారు.

ముమ్మరంగా విచారణ చేస్తున్నాం..

ఏడాదిలోపు ఒకే తరహాలో జరిగిన రెండు హత్యలపై విచారణ ముమ్మరం చేశాం. కొత్త వ్యక్తి ఎవరైనా వచ్చి హత్య చేసి వెళుతున్నారా లేక మరెవరైనా ఈ హత్యలు చేస్తున్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం. త్వరలోనే కేసును ఛేదిస్తాం.

– శ్రీనివాసరెడ్డి, డీఎస్పీ, పత్తికొండ

తలసేమియాతో విద్యార్థిని మృతి



కేజీ లలిత (ఫైల్)

పెద్దకడబూరు: తలసేమియాతో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం మండల కేంద్రం పెద్దకడబూరులో చోటుచేసుకుంది. గుడిసె వీరేష్, పార్వతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మొదటి కూతురు కేజీ లలిత(10) స్థానిక బాల వికాస్ యూపీ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. కాగా పుట్టుకతోనే తలసేమియా వ్యాధి బారిన పడటంతో నెలకు ఒకసారి రక్తాన్ని ఎక్కిస్తున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొటున్నా దంపతులు ఎలాగైనా తమ కూతురును రక్షించుకోవాలని ఎంతో తపన పడ్డారు. జగనన్న ప్రభుత్వంలో వైఎస్సార్ కానుక పింఛన్ కింద నెలకు రూ. 10వేలు లలితకు అందించారు. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ సొమ్ముతో బాలికకు అవసరమైన మందులు కొనుగోలు చేస్తూ కాలం నెట్టుకొస్తుండగా విధి చిన్నచూపు చూసింది. నాలుగు రోజులుగా చిన్నారిని జ్వరం పట్టి పీడించింది. చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మధ్యాహ్నం మృత్యుబారిన పడింది. దీంతో కుటుంబసభ్యుల ఆశలు ఆవిరయ్యాయి. తమ కళ్లెదుటే కూతురు చనిపోవడంతో వారి రోధనలను ఎవరూ ఆపలేకపోయారు.

వస్త్ర దుకాణంలో చోరీ

- రూ.1.04 లక్షల అపహరణ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలోని సిద్దిరామప్ప వాణిజ్య సముదాయంలోని వస్త్ర దుకాణంలో చోరీ జరిగింది. శనివారం వ్యాపారం ముగించుకుని దుకాణానికి తాళం వేసి వెళ్లిన యజమాని తిరిగి ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దివాకర్‌రెడ్డి, ఎస్‌ఐ గంగయ్యయాదవ్ దుకాణాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. రూ.1.04 లక్షల నగదు, సీసీ కెమెరాలు, హార్డ్‌డిస్క్ చోరీకి గురైనట్లు యజమాని చెబుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మిరప పొలంలో దొంగలు పడ్డారు



కోసిన పంటను చూపుతున్న రైతులు

కోసిగి: రైతుల కష్టాన్ని దొంగలు దోచుకెళ్లారు. కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన పంటను రాత్రికి రాత్రి ఊడ్చుకెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు కోతకొచ్చిన పండు మిరపను అపహరించారు. ఈ సంఘటన పెండేకల్లు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ధర్మయ్య, తాయమ్మ దంపతులు రెండెకరాల పొలంలో బ్యాడిగి లాలీ కంపెనీకి చెందిన మిరప రకం సాగు చేశారు. ఇప్పటి వరకు పంట సాగు కోసం రూ.3 లక్షల వరకు ఖర్చు పెట్టారు. అయితే ధర్మయ్యకు ఆరోగ్యం బాగలేక పోవడంతో తాయమ్మ నాలుగు రోజులుగా పొలానికి వెళ్లలేదు. ఇదే అదునుగా తీసుకున్న దుండగులు బాగా కాపుకొచ్చిన మిరప కాయలను అపహరించారు. ఆదివారం ఉదయం మిరప పంటకు నీళ్లు పెట్టేందుకు వెళ్లి చూసేసరికి ఎర్రగా కాచిన మిరప కాయలు కనిపించకుండా పోయాయి. దాదాపు 5 క్వింటాళ్ల మేరకు కాయలను దోచుకెళ్లారని, ప్రస్తుత మార్కెట్‌లో వాటి విలువ రూ.80వేలు విలువ చేస్తుందని బాధిత మహిళ వాపోతుంది.

రేపు జూనియర్స్ కబడ్డీ బాల బాలికల ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 9వ తేదీన బాలబాలికలకు కబడ్డీ క్రీడ నందు జిల్లా స్థాయి ఎంపిక పోటీలు పద్మావతినగర్‌లోని ఇండోర్‌స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఓబుల రెడ్డి, కార్యదర్శి ఏపీరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2004 ఫిబ్రవరి 5 తర్వాత జన్మించిన వారు అర్హులన్నారు. బాలురు బరువు 70 కేజీలు, బాలికలు 65 కేజీలు అర్హతగా నిర్ణయించారన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు నంద్యాలలో జరిగే 49వ రాష్ట్ర స్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు.